# ఊర్వశి

**ఊర్వశి** పేరుకు తగ్గట్టు ఎంతో అందంగా వుంటుంది. కాలేజీలో కొలీగ్స్ ఆమెకు పెట్టిన పేర్లు త్రిలోక సుందరి... భూలోక సుందరి... ఇలా ఎన్నో ఎన్నెన్నో మొత్తం మీద ఆమె అందాల రాశి. అపరంజి బొమ్మ. అందులో సందేహం లేదు.

వార పత్రికలు చదవడం ఆమె అలవాటు. సినిమాలు చూడడం ఆమె అభిరుచి. 'అమ్మా ఊరు!' గుమ్మంలో అడుగు పెడుతూనే కేక పెట్టాడు మారుతిరావు.

'ఏమిటి నాన్నా ఆ పిలుపు?' అన్నది ఊర్వశి బుంగమూతి పెట్టి.

'అదీ నీ ముద్దుపేరు తల్లీ, ఇంతకు నన్ను విషయం చెప్పనిచ్చావు కాదు'

ఏమిటన్నట్టు కళ్ళు చక్రాల్లా తిప్పింది ఊర్వశి.

'ఈ సాయంత్రం నిన్ను చూడడానికి పెళ్ళి వారొస్తున్నారు. తయారుగా వుండు'. 'బావుంది సంబడం. అబ్బాయి ఎవరో ఏమిటో ఏం చెప్పకుండానే మధ్యలో అందుకుంది అనంతలక్ష్మి.

'నేనేమైనా ఆషామాషీ సంబంధం పట్టుకొస్తాననుకుంటున్నావా?... కుర్రవాడు పెద్ద ఇంజనీరే' అన్నాడు మారుతీరావు మీసాలు తిప్పుతూ.

'ఇంజనీర్లు, డాక్టర్లు నాకొద్దు నాన్నా. నేను ప్రఖ్యాత రచయితను చేసుకుంటాను'

'రచయిత?!' ఆముదం త్రాగినట్టు ముఖం పెట్టాడు మారుతీరావు.

'ఏం నాన్నా అలా అయిపోయావు. రచయితలంటే చిన్న చూపొద్దు. షేక్స్పియర్, టాలస్టాయ్ లాంటి ప్రఖ్యాత రచయితల పేర్లను తరాలు మారుతున్నా ప్రపంచం మననం చేసుకుంటూనే వుంది. వాళ్ళ రచనల్ని చదవని వాళ్ళు లేరు. వారికున్న పేరు ప్రతిష్టలు ఈ లోకంలో ఎవరికున్నాయి?' అంది ఊర్వశి.

మారుతీరావు దంపతులకు ఊర్వశి లేక లేక కలిగిన నలుసు. గారాల పట్టి. ఆ ఇంట్లో ఆమె ఆడింది ఆట పాడింది పాట. దాని మాటకెవరూ ఎదురు చెప్పడానికి ఇష్టపడరు. అందుకే కూతురికెలా చెప్పాలో తెలీక 'నేటి సుప్రసిద్ధ రచయితలంతా నాలుగు పదులు నిండిన వారే నమ్మా. అందరికీ పెళ్ళిళ్లైపోయాయి. అంచేత..' నచ్చ చెప్పబోయాడు మారుతీరావు.

'నథింగ్ డూయింగ్. పెళ్ళైనవాడే కాదు. అతనికి పిల్లలున్నా ఫరవాలేదు. ఐ లైక్ టు మ్యారీ ఎ రైటర్... గ్రేట్ రైటర్' మరో మాటకు అవకాశమివ్వకుండా అక్కడినుండి వెళ్ళిపోయింది ఊర్వశి.

ఆమె ధోరణికి అవాక్కైపోయారు మారుతీరావు దంపతులు.

★ ★ ★

విజయ్ అందాన్ని ఆరాధించే వ్యక్తి. జీవితంలో స్థిరపడ్డా ఇంకా పెళ్ళి చేసుకోక పోవడానికి కారణం ఇంత వరకు తన కలలరాణిని కలుసుకోక పోవడమే.

ఆఫీసుకు బయలుదేరిన విజయ్ సిగరెట్లు కొనుక్కుందామని కిళ్ళీబడ్డీ దగ్గర స్కూటరాపాడు.

అక్కడో మెరుపుతీగను చూసిన విజయ్ కళ్ళు జిగేల్‌మన్నాయి.

తెల్లటి మల్లెపూవు లాంటి వాయల్ చీరలో ఊర్వశి దేవకాంతలా కనిపించింది.

ఏదో వారపత్రిక కొనుక్కుని వెళ్ళిపోయిందామె.

'ఆ అమ్మాయి మా రెగ్యులర్ కస్టమర్. ప్రతివీక్లీ మా దగ్గరే కొంటుంది' అన్నాడు బడ్డీవాడు పక్కవాడి ప్రశ్నకు జవాబుగా.

ఆ మాటలు విజయ్ చెవిలో పడ్డాయి. అంతే, ఆమె అభిరుచులను పసిగట్టేశాడు.

విజయ్ అడుగుల సవ్వడికి వెనుతిరిగి చూసింది ఊర్వశి.

ఆమె కళ్ళు రెండు వెండిమబ్బు తునకల్లా గోచరించాయి అతడి కళ్ళకి.

'ఎక్స్‌క్యూజ్ మీ'

తీక్షణంగా చూసింది ఊర్వశి'

'ఇఫ్ యు నెవర్ మైండ్, ఆ వీక్లీ ఓ మారు...' అన్నాడు విజయ్.

అతడి మాటలలో తడబాటు.

చూపుల్లో అభ్యర్థన.

యాంత్రికంగా పుస్తకం అందించింది ఊర్వశి.

'ఇందులో నా కథగానీ...' అంటూ పేజీలు తిరగవేయసాగాడు విజయ్.

'హాయ్!.. మీరు రచయితా?.. కథలు రాస్తారా?' ఆసక్తిని కనబరిచింది ఊర్వశి.

'ఔనండి' అన్నాడు విజయ్.

'మీ పేరు'

'విజయ్‌కుమార్. సింపుల్‌గా విజయ్ అని పిలుస్తారు'

' ఆ పేరెక్కడా పత్రికల్లో...'

'చూడలేదంటారు. అంతేనా. మీరామాట అంటారని నాకు తెలుసు. బైదిబై మీరు ఎక్కువగా ఏ పుస్తకాలు చదువుతూ వుంటారు?' అని అడిగాడు.

'వచ్చిన ప్రతివీక్లీ, మెచ్చిన ప్రతి నవలా'

'అలా చెప్పండి. నా కథలన్నీ డైలీల్లోనే పడుతూ వుంటాయి. ఫర్‌యువర్ ఇన్‌ఫర్మేషన్ ఈ మధ్యే రెండు కథలు వార పత్రికలకు పంపడం జరిగింది. ఇంటిమేషన్ ఇవ్వకుండా పబ్లిష్ చేసేస్తారేమోనని' కటింగ్ వదిలాడు విజయ్.

'సారీ, అపార్థం చేసుకున్నందుకు ఏమీ అనుకోకండి. మీ వంటి ప్రసిద్ధ రచయతతో పరిచయం కలగడం నాభాగ్యం'

'మీ వంటి అందమైన అమ్మాయిని కలుసుకోవడం నా అదృష్టం'

పరస్పర ప్రశంసల అనంతరం 'మే ఐ నో యువర్ గుడ్‌నేమ్?' అడిగాడు విజయ్.

'ఊర్వశి'

'ఫెంటాస్టిక్. మోస్ట్ సూటబుల్ నేమ్'

విజయ్ పొగడ్తలకు మెలికలు తిరిగిపోయింది ఊర్వశి.

ఇలా ఆరంభమైన వారి పరిచయం స్నేహంగా మారడానికి తదుపరి అది ప్రేమగా పరిణతి చెందడానికి అట్టే కాలం పట్టలేదు.

'మీ పబ్లిషయిన కథలుంటే ఇవ్వండి. చదివిస్తాను' అంది ఓ రోజు ఊర్వశి.

ఆ మాటకు ఉలిక్కిపడ్డాడు విజయ్. కొంపతీసి తన మీద అనుమానం రాలేదు కదా? అనుకున్నాడు.

'మిమ్మల్ని డిసపాయింట్ చేస్తున్నాను. వెరీ సారి. నా రచనలు డైలీలలో పడడం వల్ల వాటిని వెంటవెంటనే కేర్‌ఫుల్‌గా ప్రిజర్వు చేయలేక పోయాను. కొద్దికాలం ఓపిక పట్టండి నా రాబోయే కథలన్నీ ఇక వీక్లీలలోనే చూస్తారు' మాటలలో తొట్రుపాటు కనబడనీయకుండా జాగ్రత్త పడుతూ అతికినట్టు అబద్ధమాడాడు విజయ్.

తానో రచయితనని రుజువైతే తప్ప ఊర్వశి తనను చేపట్టదు. ఆమె లేకుండా తను జీవించలేడు. ఇప్పుడెలా? రాత్రంతా టీలు త్రాగుతూ సిగరెట్లు తాగుతూ ఆలోచించాడు. మరునాడు లైబ్రరీకెళ్ళి పత్రికలన్నీ తిరగేశాడు. కాగితం పెన్ను పుచ్చుకుని ఆఫ్టరాల్ ఓ చిన్న కథ రాయలేనా అనుకుని రచన చేయడానికుపక్రమించాడు. ప్చ్... ఒక్క అక్షరం ముక్క పడితే ఒట్టు. కథ రాయడం తమాషా కాదని అది కూడా ఒక కళేనని ఆలస్యంగా తెలుసుకున్నాడు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా రెండు మూడు రోజులు బుర్రబద్ధలు కొట్టుకుని ఓ కథ తయారుచేసి పత్రికా కార్యాలయానికి వెళ్ళాడు.

'సార్!'

రచనలు పరిశీలిస్తూనే 'ఊ' అన్నాడు పత్రికా సంపాదకుడు.

పొట్టిగా లావుగా గుబురు మీసం ఒత్తైన జుట్టు తెల్లని పైజమా కల్లీ లాల్చీలో గంభీరంగా కనిపిస్తున్నాడాయన.

'నేనొక కథ రాసి పట్టుకొచ్చాను'

'అలా వుంచండి' తలపైకెత్తకుండానే సమాధానమిచ్చాడు ఎడిటర్.

'వుంచడానికి కాదు పట్టుకొచ్చింది. మీరీ కథను వెంటనే ప్రచురించాలి'.

శాసిస్తున్నట్టున్న విజయ్ మాటలకు గుర్రుగా చూశాడు సంపాదకుడు.

వణుకుతున్న చేతులతో స్క్రిప్టు అందించాడు విజయ్.

వ్రాతప్రతినోమారు అటు ఇటు తిప్పి 'మీరేం పట్టుకొచ్చినా పత్రికల వాళ్ళు ప్రచురించేస్తారనేనా మీ భావన. అసలు పత్రికలంటే మీ కెలా కనిపిస్తున్నాయి?' ఎదురు ప్రశ్న వేశాడు కాస్తంత సీరియస్‌గా.

'క్షమించండి. నేనింత వరకు కథలు రాయలేదు. ఇదే ననా మొదటి రచన. దీని మీదే

నా భవిష్యత్తు ఆధారపడి వుంది. నేనో రచయితనైతే తప్ప నేను కోరుకున్న అమ్మాయి నాకు చేరువవదు. అందుకే మిమ్మల్ని అర్థిస్తున్నాను. దీనినెలాగైనా ప్రచురించి పుణ్యం కట్టుకోండి. నాకు పారితోషికం వద్దు. ముద్రిస్తే చాలు'.

దీనంగా ఉన్నాయి అతని పలుకులు. జాలి గొలుపుతునన్నాయి అతడి చూపులు. 'రచన పరిశీలించి మా నిర్ణయాన్ని తెలియపరుస్తాం. మీరు వెళ్ళండి' అన్నాడు సంపాదకుడు అతని పరిస్థితికి నివ్వెరపోతూ.

వెళ్ళిపోయాడు విజయ్.

'ఈరోజు మిమ్మల్ని నాన్నగారికి పరిచయం చేయాలనుకుంటున్నాను. వచ్చేటపుడు కథ లేవైనా వుంటే పట్టుకురండి' అంది ఊర్వశి.

'సెర్టన్లీ' అన్నాడు విజయ్ హుషారుగా.

బయటకి అలా అన్నాడే గాని తననో మహారచయితగా ఆమె వాళ్ళ నాన్నగారికి పరిచయం చేస్తే ఆయనగారిని ఎలా నమ్మించాలో తనకేమీ అర్థం కావడం లేదు. సందర్భానుసారంగా ఏదో ఒకటి బొంకి బయటపడితే పోలా అని మనసును సమాధానపరచుకుని బైబై చెప్పాడు.

సాయంత్రం ఆరయింది. సోగ్గాడిలా తయారై ఊర్వశి ఇంటికి బయలుదేరాడు విజయ్.

'ఈయనే విజయ్. సుప్రసిద్ధ కథాచరయిత' తండ్రికి గర్వంగా పరిచయం చేసింది ఊర్వశి.

అతడిని చూడడంతో ఖంగుతిన్నాడు విజయ్.

ఆయన ఎవరో కాదు. గుబురు మీసాల పత్రికా సంపాదకుడు.

తన కథ వేసి పెట్టండని బ్రతిమాలుకున్న ఈ వ్యక్తి మహారచయితా? మతిపోయింది మారుతిరావుకి.

వాళ్ళిరువురూ ఉలుకు పలుకు లేకుండా వుండి పోవడం చూసి నివ్వెరపోయింది ఊర్వశి.

ఉన్న పళంగా వీళ్ళకేమైంది చెప్మా అనుకుంది అనంతలక్ష్మి.

**(23-5-97, ఆంధ్రజ్యోతి వీక్లీ)**